## క్లుప్తంగా

### తులసి అలంకారంలో స్వామి దర్శనం



**నగరంపాలెం:** లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పలు పూజలు నిర్వహించారు. స్వామికి తులసి అలంకారం చేశారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఉదయం నిత్యహోమం బలిహరణ, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో పాటు ధ్వజావరోహణ, మూగ బలి, శేషవాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో శ్రీజగన్నాథ, శ్రీఆంజనేయ, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

### రేపు ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

**నెహ్రూనగర్:**రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులు, అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. నగర ప్రజలు స్థానిక సమస్యలపై అర్జీలు, ఫిర్యాదుల్ని అందించవచ్చని, నిర్దేశిత సమయంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

### ఏపీఈఏపీసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఇటీవల విడుదలైన ఏపీ ఈఏపీ సెట్–2024 ఫలితాల్లో వివిధ ర్యాంకులు సాధించిన విద్యార్థుల్ని శనివారం అరండల్‌పేట 2/3లోని శ్రీదివ్య ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ చిత్రి రాము అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి వీవీఎఎస్ సూర్య 2,154వ ర్యాంకు, మరో ముగ్గురు విద్యార్థులు 10వేలలోపు, ఐదుగురు 20వేల లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. తమ సంస్థలో శిక్షణ పొంది ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరైన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ఉత్తమ ఫ్యాకల్టీతో అత్యుత్తమ శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**నగరంపాలెం:** మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకులు కె.శివకుమారశర్మ, కె.చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో గోపూజ , కలశ ఆరాధన, గణపతి పూజ, అభిషేకాల్ని భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల మధ్య నిర్వహించారు. సాయంత్రం శ్రీ గణపతి హోమం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ నెల 26 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి తెలిపారు.

### వ్యక్తి మెడలోని గొలుసు చోరీ

**గుంటూరు ఈస్ట్:** ఆటో ఎక్కిన వ్యక్తి మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్లకు చెందిన కె.పూర్ణచంద్రరావు శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బస్సు దిగి ఆటో ఎక్కారు. అందులోని వ్యక్తులు ఆయన్ను అటు ఇటు జరగమంటూ ఇబ్బంది పెట్టారు. కొద్ది దూరం వెళ్లగానే పోలీసులు ఉన్నారంటూ ఆటోలో నుంచి దించి వేశారు. అనంతరం పూర్ణచంద్రరావు మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు అగ్నిప్రమాద బాధితుల సమావేశం

**తాడేపల్లి రూరల్:** దుగ్గిరాలలో జనవరి 19వ తేదీన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో నష్టపోయిన బాధిత రైతుల సమావేశం ఈనెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు పసుపురైతు సంఘం కమిటీ శనివారం తెలిపింది. ఉదయం 10 గంటలకు దుగ్గిరాల రైలుపేటలోని టర్మరిక్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించనున్నామని పేర్కొంది. బాధిత పసుపు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కమిటీ కోరింది.

# సీఏ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు

**నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**



సదస్సు బ్రోచర్ ప్రదర్శిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఐసీఏఐ ప్రతినిధులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఆర్థిక రంగంలో సీఏ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ–ఐసీఏఐ ప్రాక్టీస్ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో కొరిటెపాడులోని శుభకరం ఫంక్షన్ హాల్లో "జ్ఞానదీప్–2024" పేరుతో జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఆర్థిక రంగంలో సమస్యలు ఎదురైన సమయంలో వాటిని పరిష్కరించడంలో సీఏలు కీలక బాధ్యత వహిస్తున్నారని తెలిపారు. సీఏ విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఐసీఏఐ సిలబస్‌ను సులభతరం చేసిందని చెప్పారు. సీఏలో భాగమైన జీఎస్టీ, ఆదాయపు పన్ను, సాంకేతిక తదితర అంశాలపై అవగాహన పొందేందుకు ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌సీ కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో ఏపీ, తెలంగాణ, చెన్నై, బెంగుళూరు నుంచి 380కి పైగా సీఏలు పాల్గొంటున్నట్లు తెలిపారు. సదస్సులో ఐసీఏఐ కేంద్ర కమిటీ సభ్యుడు డి. ప్రసన్న కుమార్, ఐసీఏఐ గుంటూరు చాప్టర్ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, వైస్ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ్, కోశాధికారి వనిమిరెడ్డి వెంకట నరేష్, సికాస చైర్మన్ కె. మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, సభ్యురాలు భార్గవి, సీఏలు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామి కల్యాణానికి పట్టువస్త్రాలతో వస్తున్న భక్తులు

**నగరంపాలెం:** స్థానిక ఎస్‌వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం వేద పండితులు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్ని ధ్యానం, నిత్య హోమం, శ్రీ వెంకటేశ్వర మూలమంత్ర హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు చండీ యాగం, సువాసిని పూజల్ని భక్తిప్రపత్తులతో చేపట్టారు. ఉపన్యాస భారతి, విశ్రాంత ఉపాధ్యాయిని ఎం.వి. సత్యవతి లలితా సహస్ర నామం జరిగింది. సాయంత్రం శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై, స్వామి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిశోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పర్యవేక్షించారు.

# జీజీహెచ్‌కు ఐవీఎఫ్ పరికరం వితరణ



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు పరికరాన్ని అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

**గుంటూరు మెడికల్:** పెన్షన్‌లో కొంత సొమ్మును ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం కేటాయించడం అభినందనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని శుశ్రుత హాలులో శనివారం అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువ గల ఐవీఎఫ్ పరికరాన్ని సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకోసారి వివిధ రూపాల్లో అసోసియేషన్ సభ్యులు సహాయం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీఎంబీ బుచ్చిరాజు, డాక్టర్ ఎం.రాజా రాజేశ్వరి, ఉపాధ్యక్షులు జె. వెంకటేశ్వర రెడ్డి, కన్వీనర్ డి.మీరంశెట్టి, వై.చిన్నారెడ్డి పాల్గొన్నారు.

**డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొనాలని మంత్రికి ఆహ్వానం**

రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌ను శనివారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా సచివాలయంలో కలిశారు. ఆసుపత్రి అభివృద్ధి అంశాల గురించి ఆయన మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. జులై 1న డాక్టర్స్ డే పురస్కరించుకుని గుంటూరు జీజీహెచ్‌లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని డాక్టర్ కిరణ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# కొమాండూరి శేషాద్రికి పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకున్న శేషాద్రి

**నగరంపాలెం:** బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శనివారం లయబ్రహ్మ భూసురుపల్లి ఆదిశేషయ్య సంగీత పురస్కార సభ నిర్వహించారు. విద్యా వాచస్పతి డాక్టర్ కొమాండూరి శేషాద్రికి భూసురపల్లి ఆదిశేషయ్య పురస్కారం ప్రదానంతో పాటు నగదు అందజేశారు. తొలుత కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన తండ్రి పేరుతో గతంలో పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, కమలాకరరావు, భీమరాజు సూర్యారావు, పద్మశ్రీ షేక్ మహబూబ్ సుభాని, పద్మశ్రీ షేక్ కలిశాబి మహబూబ్ దంపతులు, ద్వారం దుర్గాప్రసాదరావుకు పురస్కారాలు అందజేశామని తెలిపారు. అనంతరం నాదస్వర విద్వాంసులు నాదెండ్ల శ్రీనివాసరావు, పాకల శ్రీహరి, డోళ్లు కలవకూరి శ్రీనివాసులు, భీమవరం భీమవరపు అశోక్‌లు నిర్వహించిన నాదస్వర కచేరి అలరించింది. కార్యక్రమంలో రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఏఎన్‌యూ ఆచార్యులు ఎం.కోటేశ్వరరావు, భూసురపల్లి విజయలక్ష్మి, రాహుల్, సురేష్‌బాబు, ప్రదీప్తి, ప్రహ్లాదుడు, మౌనిక, వేదవ్యాసుడు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం నెరవేర్చాలి

**సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న కోట మాల్యాద్రి

**లక్ష్మీపురం:** నగరంలోని కాకుమానువారితోటలో గల వెల్ఫేర్ సెంటర్ అభివృద్ధిపై టీడీపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. నగర నడిబొడ్డున 14 ఎకరాల వెల్ఫేర్ సెంటర్ స్థలం ఉందని, దీనిలో ఆరు ఎకరాల్లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మిస్తానని అప్పటి ప్రభుత్వం నగర ప్రజలకు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే, ఆ హామీ ఇచ్చి ఐదున్నర సంవత్సరాలు దాటిన నెరవేరలేదని తెలిపారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం సైతం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని శనివారం నాయకులు స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి సుమారు 10 జిల్లాల నుంచి రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారన్నారు. వీరికి సరిపడా పడకలు, సౌకర్యాలు ఆసుపత్రిలో లేవని, ఈ ఆరు ఎకరాల్లో నిర్మించాల్సిన భవనానికి ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. నగరంలోని పది వార్డుల ప్రజల సౌకర్యార్థం ఆసుపత్రి చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కేటాయించిన బడ్జెట్ కాగితాలకే పరిమితమైందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు విషయాలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ కూడా వెల్ఫేర్ సెంటర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు యశ్వంత్ , రావుల అంజిబాబు, సమితి సభ్యులు నూతలపాటి వెంకటేశ్వర్లు, 51వ డివిజన్ కార్యదర్శి షేక్ వలి, 50వ డివిజన్ కార్యదర్శి దండు రవీంద్ర, 48వ డివిజన్ కార్యదర్శి విరినేని వెంకటేశ్వరరావు, ఆకిటి రామచంద్రుడు, ఏఐఎస్ఎఫ్ నాయకులు బన్ని, అజయ్, కమలాకర్, బ్రహ్మయ్య, వెంగయ్య, మోహన్‌రావు, మల్లికార్జున్, తాతారావు, బాలాజీ పాల్గొన్నారు.

### బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు విరాళం



**నగరంపాలెం:** శ్రీ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ 24వ వార్షికోత్సవాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ మాదల సుధాకర్ తరఫున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదల శ్రీరామ్‌భాస్కర్ హాజరయ్యారు. జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎస్ఆర్ నుంచి ఈ ఏడాది రూ.25 లక్షల విరాళాన్ని ఆయన అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, శ్రీ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ నందమూరి బాలకృష్ణ, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, నామా నాగేశ్వరరావు, మతుకుమిల్లి భరత్ చేతుల మీదుగా శ్రీరామ్ భాస్కర్ జ్ఞాపికను అందుకున్నారు.

### విద్యాభివృద్ధికి సహకారం మరువలేనిది



**గుంటూరు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు సేవా సంస్థల తోడ్పాటు మరువలేనిదని వట్టిచెరుకూరు ఎంఈఓ జి. సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శనివారం పుల్లడిగుంట గ్రామంలో నేను బడికి పోతా ర్యాలీని నిర్వహించారు. ఎంఈఓతో పాటు ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఎండీ ఖాసిం, ఉపాధ్యాయులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు, ఎన్నారై రామ్‌చౌదరి సహకారంతో పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. సీతామహాలక్ష్మి భర్త ఉప్పుటూరి చిన రాములు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గతంలో తన సతీమణి నిర్వహించిన సేవా కార్యక్రమాలను తాము కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇర్షాద్ బేగ్, ఎస్ఎంసీ చైర్మన్ సయ్యద్ సుభానీ, స్థానిక టీడీపీ నాయకులు శేషగిరిరావు, అల్లాభక్షు, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

### కాపు అభ్యర్థులకు రిజర్వేషన్లు కల్పించాలి

**పొన్నూరు:** ప్రభుత్వం ప్రకటించనున్న డీఎస్సీలో కాపు అభ్యర్థులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. డీఎస్సీలో కాపు అభ్యర్థులకు మేలు జరిగేలా చేయాలని కోరారు. గతంలో చంద్రబాబు రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా చర్యలు చేపట్టారని, అనంతరం ప్రభుత్వం మారటంతో ఆ అంశం మరుగున పడిందని తెలిపారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని రాష్ట్రంలో అధికంగా ఉన్న కాపు, ఉపకులాలకు రిజర్వేషన్లు అమలయ్యేలా చట్టం చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నుంచే ఈ రిజర్వేషన్లు అమలుచేయాలని కోరారు.

### డివైడర్‌ను ఢీకొన్న లారీ



**ఫిరంగిపురం:** లోడుతో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన గుంటూరు– కర్నూలు రాష్ట్ర రహదారిపై మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా నంద్యాల నుంచి చేపలమేతతో రాజమహేంద్రవరం వెళ్తున్న లారీ ఫిరంగిపురంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ సుబ్బయ్యకు స్వల్పగాయాలు కాగా లారీ ముందు భాగం దెబ్బతింది. రాత్రి సమయంలో డివైడర్ కనిపించకపోవడంతో ఢీ కొట్టినట్లు లారీ డ్రైవర్ తెలిపాడు.

# పూర్వ విద్యార్థుల సేవలు వెలకట్టలేనివి



విద్యార్థులతో విశ్రాంత హెచ్‌ఎం మోహనరావు

**గుంటూరు ఎడ్యుకేషన్:** మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎస్‌కేబీఎం నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాకనాటి మోహనరావు అన్నారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం హైస్కూల్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో శనివారం ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులతో పాటుగా 6 నుంచి 9 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించే విధంగా విద్యార్థుల్ని ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాం అనే భావనను విడనాడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొత్తం రూ.1.45 లక్షల నగదును అందించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు. పూర్వ విద్యార్థి శైలజ ప్రత్యేకంగా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి చేతి గడియారం, కొందరికి పెన్నులు అందించారు. మరొక పూర్వ విద్యార్థి కన్నా అనూష విద్యార్థులందరికీ వివేకానందుని సూక్తుల పుస్తకాల్ని బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు శైలజ, అనూష, శ్యాం ప్రసాద్, మధులాల్, ఆళ్ల వీరభద్రరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# డాక్టర్ ఉమాశంకర్‌కు లెజెండ్స్ ఆఫ్ గైనకాలజీ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ఉమాశంకర్

**గుంటూరు మెడికల్:** నగరానికి చెందిన సీనియర్ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణులు, గైనకాలజిస్టుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్‌కు లెజెండ్స్ ఆఫ్ గైనకాలజీ అప్రిషియేషన్ అవార్డు లభించింది. కోల్‌కతాలో శనివారం జరిగిన విజ్‌డమ్ 2024 అప్‌డేట్ ఇన్ ఆబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ ఫాగ్సి నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన అవార్డు అందుకున్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఆయన గైనకాలజిస్టుల సంఘ నాయకుడిగా, అహల్య ట్రస్టు ద్వారా చేసిన సేవలకు గానూ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ సునీత తండూల్ వర్కర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సైంటిఫిక్ సదస్సులో ఫాగ్సి మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ రిషికేష్ పై, బెంగాల్ ఓబీజీ సొసైటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్ పాల్ పాల్గొన్నారు. అవార్డు అందుకున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల అరుణ, అహల్య ట్రస్టు నిర్వాహకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, గైనకాలజిస్టుల సంఘం నాయకులు డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, గైనకాలజిస్టులు అభినందనలు తెలిపారు.

# హోప్ విన్ హాస్పిటల్స్ సేవలపై వెబ్ సైట్ ప్రారంభం



వెబ్ సైట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ షమ సుల్తానా, పక్కన డాక్టర్ నజీరుద్దీన్, వైద్యులు, సిబ్బంది

**గుంటూరు మెడికల్:** హోప్ విన్ హాస్పిటల్స్ అందిస్తున్న వైద్య సేవల గురించి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హెచ్‌టీటీపీ://హోప్‌విన్ హాస్పిటల్.ఇన్ అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. గుంటూరువారితోట 7వ లైన్‌లో ఉన్న హాస్పిటల్స్ ప్రాంగణంలో శనివారం ఫౌండర్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్స్ సమక్షంలో వెబ్‌సైట్‌ను డాక్టర్ షమ సుల్తానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువ నారిస్ హెల్త్ కేర్ ట్రస్టు వైద్య సేవల గురించి, హోప్ విన్ హాస్పిటల్స్ అందిస్తున్న ఉచిత వైద్య సేవల గురించి, స్త్రీల ప్రసూతి ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేలా అందించిన సమాచారాన్ని వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. అపాయింట్‌మెంటుతో పాటు సలహాలు, సూచనల్ని ఈ వెబ్ సైట్ నుంచి స్వీకరిస్తామని పేర్కొన్నారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నానుడితో ఒక్క రూపాయి కూడా ఖర్చు లేని విధంగా రూపొందించిన ఈ వెబ్ సైట్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# నైపర్ పరీక్ష ఫలితాల్లో 'చలపతి' ప్రతిభ



నైపర్ పరీక్షల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన చలపతి ఫార్మసీ విద్యార్థులు

**గుంటూరు రూరల్:** జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావిధానాల ద్వారా తమ కళాశాల విద్యార్థులు ఎల్లప్పుడూ అన్ని పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాం కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో ఫార్మసీ విద్యను అందిస్తున్న నేషనల్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎన్ఐపీఈఆర్) ప్రతి ఏడాది నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. తమ కళాశాలకు చెందిన కె.విజయ జాతీయ స్థాయిలో 756వ ర్యాంకు సాధించిందన్నారు. కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులు నైపర్‌కు అర్హత సాధించారన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

**చిప్స్ విద్యార్థుల ప్రతిభ**



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చిప్స్ కళాశాల యాజమాన్యం

ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన నైపర్ 2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారన్నారు. దేశవ్యాప్తంగా 6 వేల మంది ఫార్మసీ విద్యార్థులు ఈ పోటీ పరీక్షకు హాజరుకాగా తమ కళాశాలకు చెందిన విద్యార్థిని డి.రసజ్ఞ 957వ ర్యాంకు, సీహెచ్ సంగీత 2953వ ర్యాంకు, వి.రత్నశ్రీ 3446వ ర్యాంకు, ఎస్.ఉదయ్‌కిరణ్ 4,326వ ర్యాంకు, ఎం.నిఖిల్ 4,677వ ర్యాంకు, డి.మంజుల 4,985వ ర్యాంకు, ఎం.దేవరాజకుమారి 5,075వ ర్యాంకు సాధించారన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ అభినందించారు.

### బాలిక అదృశ్యం

**గుంటూరు ఈస్ట్:** బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ కాలనీకి చెందిన 17 సంవత్సరాల బాలిక శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.